క్లుప్తంగా

ఎయిడ్స్ వ్యాధిని అరికట్టాలి

ఆకివీడు: లైంగిక సంపర్కం వల్ల వచ్చే వ్యాధుల్లో ప్రమాదకమైనది ఎయిడ్స్ వ్యాధి అని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహనా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులు ఫేస్ పెయింటింగ్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి గురైన వ్యక్తుల నుండి రక్తం సేకరించకూడదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.ఓగేశ్వరరావు, కె.శామ్యూల్, ఇందిర, జి.సంజీవరాజు, యు.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భీమవరం: భగవద్గీత శ్లోకం పోటీల్లో భీమవరం శ్రీకాకతీయ మెరిట్‌స్కూల్ విద్యార్థులు పలు బహుమతులు అందుకున్నారని స్కూల్ కర్సపాండెంట్ అక్కినేని కృష్ణకిషోర్ చెప్పారు. విజేతలను శుక్రవారం అభినందించిన సందర్భంగా విలేకర్లకు వివరాలను వెల్లడించారు. చిన్మయమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గ్రూప్‌-ఎలో(యూకేజీ) కె శశిదీపిక, కె రామరిషిక, కె దీక్షిత వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకున్నారు. గ్రూప్‌-బి(ఫస్ట్, సెకండ్ క్లాస్) శాన్విక, సీహెచ్ రుద్ర, టి శాన్వి, గ్రూప్‌-డి(5వ తరగతి) పి శార్విక్‌వర్మ, టి వైష్ణవి, ఎస్ పూర్ణక్షయ, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకోగా గ్రూప్‌-ఈ (7వ తరగతి)లో బి నమర్మత, వి యోగిదీపిక ప్రథమ, ద్వితీయ బహుమతులు గెల్చుకున్నారని కృష్ణకిషోర్ చెప్పారు. అనంతరం విజేతలను కృష్ణకిషోర్, స్కూల్ ఏవో రమాదేవి, ఏడీ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

వేద పాఠశాలకు ఆటో బహూకరణ

ఆకివీడు: మండలంలోని అయిభీమవరంలోని శ్రీ వేంకటేశ్వర వేద పాఠశాలకు ఏలూరుకు చెందిన గుప్తా ఫౌండేషన్ ఆటోను బహూకరించింది. మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు చేతుల మీదుగా ఆటోను వేద పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా బాపిరాజు మాట్లాడుతూ వేద పాఠశాల విద్యార్థులు ఆసుపత్రులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆటో వల్ల కొంత భారం తగ్గుతుందన్నారు. పాఠశాలలోని సుమారు 120 మంది విద్యార్థులకు గొట్టుముక్కల సుబ్బరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కనుమూరు అన్నపూర్ణ, వేద పాఠశాల ప్రిన్సిపాల్ లింగాల సత్యనారాయణమూర్తి, గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, జంపన సుబ్రహ్మణ్యంరాజు, కనుమూరు రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

వీరవాసరం: బాలబాలికలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ లక్ష్మికాంతం చెప్పారు. శుక్రవారం వీరవాసరం మండంలో మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిషోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు నిరోధించాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్కొక్కరికీ రెండు లేదా మూడు గ్రాడ్యుయేట్ ఓట్లు

ఉండి: ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల మొదటి జాబితాలో ఉండి మండలానికి సంబంధించి కొందరికి రెండు, మరికొందరికి మూడు ఓట్లు వచ్చాయి. దీనిపై తహసీల్దార్ కార్యాలయ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఇ.రత్నకుమార్‌ను వివరణ కోరగా ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ ఓట్లరు తమ ఓటు నమోదు చేసుకున్న సమయంలో ఈ విధంగా జరిగి ఉంటుందని తెలిపారు. సాంకేతిక సమస్యల కారణంగా కూడా ఈ విధంగా ఓట్లు వచ్చినట్లు తెలిపారు. వీటిపై పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తున్నామని వాటిని గుర్తించి తొలగిస్తామని తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు 27 ఓట్లు డబ్లింగ్, కరెక్షన్స్ ఓట్లు వరకు వచ్చినట్లు తెలిపారు. వీటిని డిసెంబర్ 9లోపుగా సరి చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

పాలకోడేరు: పాఠశాలలకు వెళ్లే పిల్లల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా రాష్ట్రీయ బాల సురక్ష (ఆర్‌బీఎస్‌కె) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాలకోడేరు మండలం విస్సాకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పి.లలిత, ఏఎస్ఎం హేమకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్షల ద్వారా పిల్లలలో ఎదుగుదల లోపం, రక్తహీనత, బీపీ, దృష్టి లోపం, ఇతర అనారోగ్య లక్షణాలను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యునితో పరీక్షించి ఇతర చికిత్సలు అవసరమైన వారిని జిల్లా ఆస్పత్రికి పంపి తగిన చికిత్స చేయిస్తామన్నారు.

దిరుసుమర్రులో అర్ధరాత్రి కోడిపందేలు

భీమవరం (ప్రకాశం చౌక్): మండలంలోని దిరుసుమర్రు గ్రామంలోని ఓఎన్జీసీ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి భారీగా కోడిపందేలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధుల అండతో ఈ కోడిపందేలు జరుగుతున్నట్లు సమాచారం. పోలీసుల కోడిపందేలు జరుగుతున్నాయని తెలిసి కూడా పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ కోడిపందేల్లో పలు ప్రాంతాల నుంచి ప్రముఖులు పాల్గొన్నట్లుగా తెలుస్తోంది.

చిట్టడవిని తలపిస్తున్న మంచినీటి ట్యాంకులు



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు చుట్టు భారీగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, అడవిని తలపిస్తున్న దృశ్యం



చెరువు గట్టుపై తాగి పడేసిన మద్యం సీసాలు

- సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల చుట్టూ భారీగా పెరిగిన పిచ్చి మొక్కలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాకు వినియోగించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు(చెరువులు) చుట్టూ భారీగా పిచ్చి మొక్కలు, పొదలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. మంచినీటి చెరువుల చుట్టూ కనీసం మనుషులు నడిచి వెళ్లేదారి కూడా లేకుండా మొక్కలు అలుముకున్నాయి. చెట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. దీంతో చెరువుకు రక్షణ కరువైంది. చెరువు పరిస్థితిని తనిఖీ చేసేందుకు వాటర్ వర్క్స్ సిబ్బంది భయపడుతున్నారు. భారీగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు విష సర్పాలకు నిలయంగా మారాయి. గతంలో మంచినీటి చెరువుల రక్షణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. అధికారులు, సిబ్బంది ద్విచక్ర వాహనంపై వెళ్లి చెరువు గట్లు, నీటి స్టోరేజీ సామర్థ్యాన్ని పరిశీలించేవారు. నేడు రెండు చెరువుల పరిశీలన ఊసేలేదు.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మంచినీటి చెరువుల చుట్టూ దారుణంగా పిచ్చి మొక్కలు పెరిగిపోయి రక్షణ కరువైనప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. కాలువల్లో నీటి నిల్వలు తగ్గినప్పుడు భీమవరం పట్టణ ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా దాదాపు 120 ఎకరాల విస్తీర్ణంలో ఈ రెండు చెరువులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఎండాకాలంలో అయితే రెండు పూటలా మంచినీటి సరఫరాకు ఏళ్ల తరబడి ఈ చెరువులు ఉపయోగపడుతున్నాయి. ఇంతటి ప్రాధాన్యతన కలిగిన ఈ చెరువు గట్లపై మొక్కలు, తుప్పలు పెరిగి అధ్వానంగా మారినా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విస్సాకోడేరు లేఅవుట్‌కు వెళ్లే వారు భయపడుతున్నారు

మంచినీటి చెరువు గట్టుకు అనుకుని విస్సాకోడేరు లేఅవుట్‌కు వెళ్లే దారి దాదాపు 100 మీటర్లు మేర ఉంటుంది. దాంతో చెరువు గట్టు అడవి మాదిరిగా ఉండడంతో ఆ దారిన వెళ్లే వారు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో పాములు, జంతువులు దాడి చేస్తాయని భయపడపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుగట్లపై వృక్షాలు, మొక్కలు తొలగించి చెరువుల గట్లను శుభ్రం చేసి, రక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి



వీరవాసరంలో పర్యటిస్తున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

వీరవాసరం: ప్రజల ఆరోగ్యం పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు తెలిపారు. కిశోర బాలికల వికాస శిక్షణ కార్యక్రమం శుక్రవారం వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ ముఖ్యంగా బాలబాలికలకు పౌష్టికాహారం అందజేసేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. కిషోర బాలికలు, బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని స్వీకరించాలన్నారు. ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చని సూచించారు. అనంతరం దూసనపూడి గ్రామంలో నిర్వహించిన డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, దేవదాసు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు



ఆకివీడు: మార్కండేశ్వరస్వామి ఆలయంలో లక్ష పత్రి పూజ చేస్తున్న భక్తులు



ఆకివీడు: పురాతన శివలింగానికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు

ఆకివీడు: కార్తీక మాసంలో వచ్చే మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి సాయింత్రం వరకూ ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకాలతో పాటు కుంకుమ పూజ, లక్ష పత్రి పూజ, లక్ష దీపార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షకార్యదర్శులు గొంట్లా గణపతి, కాకర్ల రాజరాజేశ్వరి ఫణి ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని పురాతన శివలింగానికి, అప్పారావుపేటలోని ఉమా రామ లింగేశ్వరస్వామికి, పిల్లలమర్రి అగ్రహారంలోని వేంకట లింగేశ్వరస్వామికి, భీమేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామిలకు అన్నాభిషేకాలు నిర్వహించారు.

కాళ్లలో..

కాళ్ల: మండలంలోని సీసలిలోని ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి శుక్రవారం లక్ష బిల్వార్చన పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన కట్రెడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి గణేశ్న పద్మారావు, నాగ మల్లీశ్వరి దంపతులు, శ్రీనివాసరావు, వెంకట రామకృష్ణ, వేణుగోపాలరావు దంపతులతో తొలుత అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో అన్నసమారాధన చేశారు. అలాగే స్థానిక గంగా పార్వతి సమేత సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.



కాళ్ల: సీసలిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

రైతులను దోచుకుంటున్న దళారులు



ధాన్యం పట్టుబడులకు సంబంధించి రైతులతో మాట్లాడుతున్న రామాంజనేయులు

భీమవరం: బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడడంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఆసరాగా చేసుకుని రైతుల వద్ద ధాన్యాన్ని దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో రైతులతో మాట్లాడిన రామాంజనేయులు భీమవరంలో విలేకర్లతో మాట్లాడారు. గత వారం రోజులుగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రైతులు వరి పంట కోసిన వెంటనే అమ్మేస్తున్నారని దీంతో ధళారులు, మిల్లర్లు తేమశాతం పేరుతో 75 కిలోల బస్తాకు కేవలం రూ.1,450 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోడానికి పెనుమంట్ర, అత్తిలి మండలాల్లో జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సబ్బరాజుతో కలసి పర్యటించి రైతులు, రైతుసేవా కేంద్రాల అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై ప్రభుత్వాధికారులు తక్షణం స్పందించి మాసూళ్లు చేసిన వెంటనే పట్టుబడి పట్టే ధాన్యానికి కనీసం రూ. 1,550 తగ్గకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోనెసంచుల కొరత రాకుండా చూడాలని, రైతుసేవా కేంద్రాల ద్వారా వాహనాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ధాన్యం తరలించాలని కోరారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



కేజీఆర్‌ఎల్ కళాశాలలో రక్తదాన శిబిరం దృశ్యం

భీమవరం: విద్యార్థులందరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా భీమవరం కేజీఆర్‌ఎల్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్, యూబీఏ కోఆర్డినేటర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మెంటే హరనాథ్‌బాబు మాట్లాడుతూ రక్తదానం పట్ల అనేకమంది అపోహలున్నాయని వాటిని తొలగించడానికి విద్యార్థులు తరచు రక్తదానం చేయడంతోపాటు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పీజీ కోర్సెస్ డైరెక్టర్ తోట రామ్మూర్తి మాట్లాడుతూ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా రక్తదానం చేయడానికి అధ్యాపకులు, విద్యార్థులు సేవాభావంతో ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. అనంతరం 72 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ వైస్ ప్రిన్సిపల్ ఐ రామచంద్రమూర్తి, ఎంబీఏ డైరెక్టర్ సీహెచ్ వినోదరావు, ఫార్మసీ డైరెక్టర్ కవల నాగేశ్వరరావు, ఫార్మసీ ప్రిన్సిపల్ డి రాఘవ, యూబీఏ కోఆర్డినేటర్లు బి శ్రీనిధి, ఎస్ గౌతమ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సిహెచ్ సంపత్‌కుమార్, పి కిరణ్మయి, ఎన్ శ్రీవల్లి, కె ఐజక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వనసమారాధన అభినందనీయం



భీమవరంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: దివ్యాంగులు, అంధులు, బధిరులతో కార్తీక వనసమారాధన నిర్వహించడం అభినందనీయమని, వనసమారాధనలు సమైక్య భావాన్ని పెంపొందిస్తాయని భీమవరం మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రరెడ్డి అన్నారు. భీమవరం మార్కెట్ యార్డులో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులు, బధిరులు, అంధులు మానసిక వికలాంగులతో కార్తీక వనసమారాధన నిర్వహించి వారికి దుప్పట్లు, కంచాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగులు దేనిలోనూ తీసిపోరని వివిధ పోటీల్లో పాల్గొని నిరూపించారన్నారు. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీవిశ్వనాథరాజు, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ భీమవరం యూనిట్ జిల్లా చైర్మన్ చిలుకూరి వెంకటనర్సింహారాజు మాట్లాడుతూ సకలాంగులను మించి దివ్యాంగులు ఎంతో ముందున్నారని, వన సమారాధనతో వాళ్లలో చైతన్య స్ఫూర్తి కలుగుతుందన్నారు. సుమారు 400 మందికి దుప్పట్లు, కంచాలు, దాతలు చిలుకూరి నర్సింహారాజు, గంధం శ్రీదేవి, సామంతపూడి మణి ఆర్థిక సహకారంతో అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంటేటి వెంకటరాజు, ఇన్నర్ వీల్ క్లబ్ నాయకురాలు ఆరేటి రాణి, చీడే అమ్మాజీ, సామంతుపూడి మణి, భీమవరం లయన్స్ క్లబ్ డైరెక్టర్ నందమూరి రాజేష్, లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ నరహరిశెట్టి కృష్ణ, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

108 కలశాలతో ఆధ్యాత్మిక ర్యాలీ



ఉండిలో 108 కలశాలతో ఆధ్యాత్మిక ర్యాలీకి సిద్ధం చేస్తున్న దృశ్యం

ఉండి: గ్రామంలో విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా సత్యకిరణ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం 108 కలశాలతో ఆధ్యాత్మిక ర్యాలీ నిర్వహించారు. ఉండి నిమ్మలపేట కనకదుర్గమ్మ గుడి వద్ద నుంచి గ్రామంలోని వివిధ దేవాలయాల మీదుగా ఈ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహకుడు సత్యకిరణ్‌ప్రసాద్ మాట్లాడుతూ హిందువుల్లో ఆధ్యాత్మిక బలోపేతం కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండాబత్తుల సుబ్బారావు, మోపిదేవి శ్రీనివాస్, చలపతి, ఖండాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం



కాళ్ల పీహెచ్‌సీను పరిశీలిస్తున్న వైద్య,ఆరోగ్యశాఖ ప్రత్యేక అధికారి శ్యామ్‌సుందర్

కాళ్ల: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని దానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని జిల్లా సమగ్రశిక్ష పీడీ, వైద్య,ఆరోగ్యశాఖ మండల ప్రత్యేక అధికారి శ్యామ్‌సుందర్ అన్నారు. కాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్స్ నిల్వలు, పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిధిలో గర్భిణుల వివరాల నమోదు, ఓపీ తదితర విషయాలను సిబ్బందిని అడిగితెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీని నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నినాదమైన ।ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ౕ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కాళ్ల మండలం గా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్ కుమార్, డాక్టర్ సునీత, డాక్టర్ భావన తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఒప్పందాలు రద్దుచేయాలి



భీమవరం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: అదానీ ఒప్పందాలు రద్దుచేయాలి, ట్రూ అప్‌చార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ, ఫార్వర్డ్‌బ్లాక్, ఎంసీపీఐ(యు), న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో శనివారం భీమవరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లాకార్యదర్శి బి బలరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను ప్రత్యక్షంగా పెంచకుండా పరోక్షంగా ట్రూ అప్ చార్జీలు, ఇందన చార్జీల పేరుతో ప్రజలపై రూ. 20వేల కోట్లు భారం వేసిందని విమర్శించారు. ట్రూ అప్ చార్జీలను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ విధానాన్ని తక్షణం రద్దు చేయాలని బలరాం డిమాండ్ చేశారు. అదాని కుంభకోణంపై విచారణ జరపాలని, అవినీతి ఒప్పందాలు రద్దు చేయాలని, అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎం.సీతారామ్‌ప్రసాద్ బి.వాసుదేవరావు, ఎంవై కుంతరావు, త్రిమూర్తులు, కలిపిండి సత్యనారాయణ, బంగారు వరలక్ష్మి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన

ఉండి: ప్రతి గ్రామంలోని జంక్షన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాలను నియంత్రణకు సహకరించాలని ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా అన్నారు. శుక్రవారం మండలంలోని చినపుల్లేరు, యండగండి, ఆరేడు, కలిగొట్ల, ఉప్పులూరు, ఉణుదుర్రు గ్రామాల్లో సీసీ కెమెరాలపై ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలకు అవగాహన సమావేశాలను నిర్వహించారు. చినపుల్లేరులో సర్పంచ్ పెన్మత్స సావిత్రమ్మరామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎస్సై నసీరుల్లా సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు.

నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణ



వడ్లాది కృష్ణ

కాళ్ల: పశ్చిమగోదావరి జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా జేఏసీ ఉపాధ్యక్షుడిగా కాళ్లకూరు గ్రామానికి చెందిన వడ్లాది కృష్ణ ఎన్నికయ్యారు. శుక్రవారం కృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ జేఏసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని కృష్ణ తెలిపారు. భీమవరం టౌన్ అధ్యక్షుడు మల్లువలస రఘు, తుంపల శ్రీను, చీపురుపల్లి చిన్ని, ఉండి సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

దాళ్వాకు ఎంటీయూ 1426 అనుకూలం



ఖరీఫ్ సాగును పరిశీలిస్తున్న మార్టేరు, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు.

ఆకివీడు: నూతన వంగడాలను సాగు చేస్తూ రైతులు స్థానిక ప్రజలు తినే బియ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని, అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఖరీఫ్ సాగులో ఎంటీయూ 1310 రకం వగడం దిగుబడిని పరిశీలించేందుకు శుక్రవారం ఈ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడులు, తక్కువ రోజుల్లో దిగుబడులు అధికంగా వచ్చే వంగడాలపై రైతుల దృష్టి ఉందన్నారు. ఎంటీయూ 1310 రకం, చౌడును తట్టుకునే ఎంటీయూ 1293 వంగడం, ముంపును తట్టుకునే ఎంటీయూ 1232 రకం వంగడాల సాగు ఆశాజనకంగా ఉందని చెప్పారు.వచ్చే దాళ్వా సాగులో రైతులు నూతన వరి వంగడాలు సాగు చేసేందుకు ఎంటీయూ 1426 రకం వంగడాన్ని ఏడు జిల్లాలో 160 మినీ కిట్లు పంపిణీ చేసినట్లు వివరించారు.1121 రకంతో ఎస్ఎల్ఆర్ 34449 వరంగడాన్ని సమ్మేళనం చేసి ఎంటీయూ 1426 వంగడాన్ని సృష్టించినట్లు చెప్పారు. మధ్యస్థ సన్నాలుగా ఉండి బీపీటీ రకాన్ని పోలి ఆర్ఎన్ఆర్‌కు ధీటుగా ఉంటుందని చెప్పారు. గింజ 13.2 గ్రాముల బరువుతో ఫైన్ రకంగా నిలిచి, 50 బస్తాలకు పైబడి దిగుబడి ఉంటుందన్నారు. రైతులు మినీకిట్ల ద్వారా వంగడాన్ని సాగు చేసి ఫలితాల్ని తీసుకురావాలని సూచించారు.

ముంపును తట్టుకున్న ఎంటీయూ 1232

ఎంటీయూ 1232 రకం వంగడం ముంపును తట్టుకుని నిలబడిందని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ఖరీఫ్‌లో ప్రారంభంలో వచ్చిన వరదలకు 30 రోజులపాటు నీటిలో మునిగి ఉన్న ఈ వంగడం ముంపునీరు బయటకు పోయిన తరువాత యథావిధిగా ఎదిగిందన్నారు. జిల్లాలోని యలమంచిలి మండలం నవరసపురం గ్రామంలో రైతు ఈ వంగడాన్ని సాగు చేసి, ముంపు విజేతగా నిలిచారని శాస్త్రవేత్తలు రైతులకు తెలియజేశారు. కొల్లేరు తీర ముంపు ప్రాంత రైతులకు అనుకూలమైన వంగడంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్టేరు శాస్త్రవేత్తలు డాక్టర్ వై. సునీత, రోజా, దయాళ్, డాక్టర్ శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు, వినయ, రజిత్, ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఏఓ ప్రియాంక పాల్గొన్నారు.